





నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కర్నూలు నంద్యాల


మంగళవారం | 17 ఫిబ్రవరి 2026

పేజీలు 8


## ప్రైవేటు పరం..

# ప్రకృతి ఖతం..!!

- అక్రమ మైనింగ్‌కు అధికారుల రెడ్ కార్పెట్
- నిబంధనలకు పాతర..ఆదాయమే పరమావధిగా మైనింగ్ శాఖ తీరు
- అనుమతులు లేని క్వారీలకు 'నకిలీ లీజు ఐడీ'లతో సీనరేజ్ వసూలు




ఎర్రమట్టి తవ్వకాలు జరిగిన దృశ్యం

ప్రభుత్వం ఆదాయం కోసం కక్కుర్తి పడితే, చట్టాలు ఎలా అపహాస్యం పాలవుతాయో చెప్పడానికి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో జరుగుతున్న మైనింగ్ తంతు ప్రత్యేక ఉదాహరణగా నిలుస్తుంది. సీనరేజ్ వసూలు కాంట్రాక్ట్ దక్కించుకున్న సుధాకర్ ఇన్‌ఫ్రాటెక్ సంస్థ, మైనింగ్ అధికారుల నిర్లక్ష్య వైఖరి, అండదండలతో అక్రమ తవ్వకాలకుతరలింపుకు 'అధికారిక' రంగు పులుముతోంది. పర్మిట్లు లేని క్వారీల నుండి కూడా వసూలు చేస్తూ, చట్టవిరుద్ధమైన మైనింగ్‌ను 'సక్రమం' చేస్తున్న వైనంపై ప్రత్యేక కథనం.

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** కర్నూలు, నంద్యాల జిల్లాల లో ఖనిజ సంపద దోపిడీ ఒక వ్యవస్థీకృత ఆర్థిక నేరంగా మారింది. గతేడాది అక్టోబరు 8వ తేదీన ఈ రెండు జిల్లాల సీనరేజ్

మిగతా 2లో



పూజలందుకుంటున్న స్వామి అమ్మవార్లు

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆధ్యాత్మిక భరితంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు సోమవారం స్వామి అమ్మవార్లకు రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

మిగతా 2లో

- శ్రీశైలంలో వైభవంగా భ్రామరీ సమేత మల్లన్న రథోత్సవం
- పరవశించిన భక్తకోటి
- హోరెత్తిన ఓం నమఃశివాయ నినాదం
- స్వామి అమ్మవార్లకు కనుల పండువగా తెప్పోత్సవం

# హరహర మహాదేవ!

శ్రీశైల మల్లన్న రథోత్సవం నయన మనో హరంగా,కన్నుల పండువగా సాగింది. మహాశివరాత్రి నాడు ఆదివారం శ్రీభ్రమ రాంబాదేవిని వివాహ మాడిన మల్లికార్జున స్వామి మరునాడు సోమవారం సాయం త్రం క్షేత్ర పురవీధుల్లో రథంపై విహరిం చగా భక్తకోటి పరవ శించింది.ఓం నమ శివాయ.శంభో.. శంకర నినాదం మారుమోగగా.. డప్పు శబ్దాలు ప్రతిధ్వ నించగా... కళాకారుల విన్యాసాలు అబ్బురపరుచగా..రథం అశేష భక్తజనం మధ్య ముందుకు సాగింది.ఆ తర్వాత ఆలయ పుష్కరిణిలో తెప్పోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు.



స్వామి వారి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

## వైభవంగా శ్రీ ఉమామహేశ్వరుల కళ్యాణం



స్వామి వారి కళ్యాణోత్సవ దృశ్యం

2 లో

### ముద్దాయి దేవదాసుకు

## జీవిత ఖైదు



ముద్దాయిని సబ్ జైలుకు తరలిస్తున్న పోలీసులు

3 లో

### ఉపాధి హామీ పునరుద్ధరించే వరకు

# ఉద్యమం



డిసిసి అధ్యక్షుడు బోయ క్రాంతినాయుడు

- వీబీజీరామ్‌జీతో కూలీలకు పని దొరకదు
- నేడు కర్నూలు జిల్లాలో పర్యటించనున్న వై.ఎస్.షర్మిల
- డిసిసి అధ్యక్షుడు బోయ క్రాంతినాయుడు

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** కరవు సమయంలో కూలీలకు పని చూపించేందుకు యుపిఏ ప్రభుత్వం తీసుకువచ్చిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ఎన్‌డిఏ ప్రభుత్వం చేసిన మార్పులతో కూలీలకు అన్యాయం జరుగుతుందని కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటి అధ్యక్షుడు బోయ క్రాంతి నాయుడు ఆరోపించారు. సోమవారం డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ అమలు చేసిన పథకాన్ని మార్పు చేయడమే లక్ష్యంగా కేంద్రం ఈ పథకంలో మార్పులు చేసిందే తప్ప వ్యవసాయ కూలీలకు ఉపయోగపడేందుకు కాదని ఆయన చెప్పారు. 125 రోజుల పని దినాలు ఇస్తామని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నా కార్యాచరణలో అది అసాధ్యమని ఆయన అన్నారు. మొత్తం నిధుల్లో 40శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకం అమలు కోసం

మిగతా 2లో

### కన్నుల పండువగా శ్రీ కామేశ్వరీ సమేత

## మహానందీశ్వరస్వామి వార్ల కళ్యాణం

- వేదమంత్రాలతో లింగోద్భవ అభిషేకం
- భక్తులతో కిటకిటలాడిన క్షేత్రం
- అశ్వవాహనం పై విహరించిన స్వామి వారు

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది పుణ్యక్షేత్రంలో శ్రీకామేశ్వరి సమేత మహానందీశ్వరస్వామివార్ల కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి సయంలో లింగోద్భవ పూజలను నిర్వహించి శ్రీ మహానందీశ్వర స్వామివారికి

మిగతా 2లో



మహానంది క్షేత్రంలో కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

సూర్య



# హరహర మహాదేవ!

(మొదటి పేజీ తరువాయి)

మల్లికార్జున స్వామి,భ్రమరాంబ అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఆలయం ముందు ఉన్న గంగాధర మండపం వద్దకు మేళతాలతో తోడ్కొని వచ్చారు.అనంతరం రథశాల వద్ద ఆర్చక,వేద పండితులు రథాంగ పూజ,రథాంగ హోమాధి క్రతువులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను రథంపై అదృష్టంప చేసి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి,ఎస్పీ సునీల్ షోరాణ్, ట్రస్ట్ బోర్డు చైర్మన్ రమేష్ నాయుడు,దేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఎం.శ్రీనివాసరావు,జిల్లా అధికారులు,పోలీస్ అధికారులు దేవస్థానం అధికారులు రథోత్సవ పూజల్లో పాల్గొన్నారు.అనంతరం సాత్విక బలిగా కొబ్బరికాయ, గుమ్మడికాయలను సమర్పించారు. గంగాధర మండపం నుంచి నంది మండపంట వరకు రథోత్సవం రమణీయంగా సాగింది.రథంలో విహరిస్తున్న భ్రామరీ సమతే మల్లికార్జున స్వామిని భక్తులు కనులారా దర్శించుకుని నీరాజనాలు సమర్పించారు.ఓం నమఃశివాయ.శంభోశంకర అంటూ...భక్తులు పరమేశ్వరుడిని కీర్తించారు.రథోత్సవం ముందు కళాకారుల నృత్యాలు,కోలాటాలు, డప్పువాయిద్యాలు,కళారూపాలు, గొరవయ్యల నృత్యాలు, భాజాభజంత్రీలు,కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

**పుష్కరిణిలో తెప్పోత్సవం.. :** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీస్వామి అమ్మవార్లకు ఆలయ పుష్కరిణిలో తెప్పోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను



స్వామి వారికి తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రత్యేకంగా అలంకరించి ఆలయం నుంచి పుష్కరిణి వద్దకు తోడ్కొని వచ్చారు.అనంతరం ఆలయ అర్చకులు,వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి తెప్పపైకి చేర్చాడు.ఆలయ పుష్కరిణి చుట్టూ భక్తులు బారులుధీరగా తెప్పోత్సవం కనుల పండువగా సాగింది.

**నేడు పూర్ణాహుతి :** మహా శివరాత్రి బ్రహ్మోత్సవ యాగాది క్రతువులకు మంగళవారం పూర్ణాహుతి నిర్వహించనున్నారు.ఉదయం స్వామివారి యాగశాలలో అర్చకులు,అధికారులు పూజలు నిర్వహించి పూర్ణాహుతి నిర్వ హిస్తారు.వసంతోత్సవం, కలశోత్సవం, త్రిశూలస్నానం నిర్వహిస్తారు.సాయంత్రం ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహిస్తారు.

# ప్రైవేటు పరం..ప్రకృతి ఖతం..!!

(మొదటి పేజీ తరువాయి)

వసూలు బాధ్యతలను సుధాకర్ ఇన్‌ఫ్రాటెక్ అనే ప్రైవేటు సంస్థకు ప్రభుత్వం అప్పగించింది. రెండేళ్లకు గాను ఏకంగా రూ.337కోట్లకు టెండర్ దక్కించుకున్న ఈ సంస్థ ప్రభుత్వానికి నెలకు సుమారు రూ.14కోట్లు చెల్లించాల్సి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా కేవలం రెండు సంస్థలే టెక్నికల్ బిడ్లలో అర్హత సాధించడం, అందులో సుధాకర్ ఇన్‌ఫ్రాటెక్ ఏకచక్రాధిపత్యం వహించడం వెనుక భారీ సిండికేట్ ఉందనే అనుమానాలు ఆది నుంచీ ఉన్నాయి. ఈ భారీ లక్ష్యాన్ని (నెల వారీ రూ.14కోట్లు) చేరుకోవడానికి, ఆపై లాభాలు గడించడానికి సదరు సంస్థ ఎంచుకున్న మార్గం మైనింగ్ చట్టాలను తుంగలో తొక్కడమే. నిబంధనల ప్రకారం, కేవలం మైనింగ్ శాఖ నుండి అధికారిక అనుమతి పొందిన, లీజు ఉన్న క్వారీల నుండి తరలిస్తున్న ఖనిజానికి మాత్రమే సీనరేజ్ ఫీజు వసూలు చేయాలి. కానీ క్షేత్రస్థాయిలో జరుగుతున్న దందా వేరు.

**నకిలీ లీజు ఐడీలతో..అక్రమాలకు 'అధికారిక' రంగు :** అనుమతులు లేని క్వారీలు, రెన్యువల్ కానీ క్వారీలు, హద్దులు దాటి తవ్వుకుంటున్న క్వారీలు, ప్రభుత్వ పోరంబోకు స్థలాలు, పెద్ద పెద్ద గుట్టలు నుండి యధేచ్ఛగా తవ్వుతున్న అక్రమ మట్టి, గ్రావెల్, గ్రానైట్, రోడ మెటల్‌కు కూడా ఈ సంస్థ పర్మిట్లు జారీ చేస్తోంది. ఇందుకోసం సుధాకర్ ఇన్‌ఫ్రాటెక్, మైనింగ్ అధికారుల ప్రత్యక్ష సహకారంతో



ఎర్రమట్టి తవ్వకాలు జరిగిన దృశ్యం

"నకిలీ లీజు ఐడీ"లను సృష్టిస్తోంది. వాస్తవానికి అక్క లీజు ఉండదు. కానీ అక్రమంగా తవ్వుతున్న ఖనిజానికి, ఒక అనధికార లీజు ఐడీని జతచేసి, సీనరేజ్ ఫీజు వసూలు చేసి రశీదు ఇస్తున్నారు. దీంతో అక్రమ రవాణా కాస్త కాగితాల మీద 'సక్రమ' రవాణాగా మారిపోతుంది. మైనిగ్ రూల్స్ (10–జి) ప్రకారం అక్రమ ఖనిజానికి పర్మిట్ ఇవ్వకూడదు. కానీ ఇక్కడ కాంట్రాక్టర్ ఇస్తున్నారో మరీ ఎవరు సృష్టిస్తున్నారో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వానికి రావాల్సిన నెలవారి కోటా క్రమం తప్పకుండా అందుతుండటంతో మైనింగ్ శాఖ అధికారులు ఈ అక్రమాలను చూసీచూడనట్లు వదిలేస్తున్నారు.

**నిబంధనల ఉల్లంఘన..అధికారుల నిర్లక్ష్యం.. :** నిజానికి ఎవరైనా ఖనిజం లీజు తీసుకోవాలంటే సొంత భూమి, ఎన్విరాన్మెంటల్ క్లియరెన్స్, రెవెన్యూ శాఖ నుండి ఎన్‌ఓసి ఉండాలి. ఈ ప్రక్రియ సక్రమ మార్గంలోకి తెచ్చి లీజులు ఇప్పించడంలో విఫలమైన మైనింగ్ శాఖ, ఇప్పుడు ప్రైవేట్ కాంట్రాక్టర్ ద్వారా ఆ అక్రమార్కులకు రెడ్ కార్పెట్ పరుస్తోంది. మాకు డబ్బు వస్తోంది. కదా, ఎక్కడి నుంచి తవ్వితే మాకేంటి..?అనే ధోరణిలో మైనింగ్, విజిలెన్స్ అధికారులు వ్యవహరిస్తున్నారు. గత నాలుగు నెలలుగా వేల సంఖ్యలో అక్రమ వాహనాలకు ఇలాగే సీనరేజ్ వసూలు చేసి పంపించారు. అసలు లీజు ఎవరిది..?రశీదులో ఉన్న ఐడీ ఎవరిది..?అని లోతుగా ఆరా తీస్తే కోట్ల రూపాయల కుంభకోణం బయట పడే అవకాశం ఉంది. కేవలం కాంట్రాక్టర్ జేబులు నింపడం ప్రభుత్వ ఆదాయం నింపడమే లక్ష్యంగా మైనింగ్ చట్టాలను గాలికొదిలేసిన ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయి విచారణ జరగాలి.

**నిష్పక్షపాత విచారణ..ఉమ్మడి దాడులు అవసరం.. :** కేవలం ఈ నాలుగు నెలలు కాదు అంతకుముందు సంవత్సరాలుగా ఏ మండల పరిధిలో ఎంత మేర ప్రభుత్వ భూములలో ఖనిజాలు కొల్లగొట్టారు. అవి ఏ స్థాయిలో ఉన్నాయి. అవి చట్టపరం చేస్తే రాబోయే రోజుల్లో ఎంత మేర ఆదాయం వస్తుంది అనే క్షేత్రస్థాయి విచారణలు జరగాలి. రెవెన్యూ, పోలీస్, విజిలెన్స్ మైనింగ్ అధికారులు విడివిడిగా అక్రమ ఖనిజాల తరలింపుపై దాడులు నిర్వహించి అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇవి చాలా నిష్పక్షపాతంగా జిల్లా స్థాయి అధికారి పర్యవేక్షణలో జరిగితే పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వ ఆదాయం కాపాడిన వారవుతారని ప్రకృతి ప్రేమికులు కోరుకుంటున్నారు.

# ఉపాధి హామీ పునరుద్ధరించే వరకు ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

ఖర్చు చేయలేని స్థితిలో ఉన్నాయని, అలాంటప్పుడు ప్రభుత్వం చెబుతున్న 125 రోజుల పని దినాలు కల్పించడం ఎలా సాధ్యమవుతుందని ఆయన ప్రశ్నించారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేటాయింపులు, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ బడ్జెట్‌లో కేటాయించిన నిధులు చూస్తుంటే కేద్రం కొత్తగా తీసుకువచ్చిన వీబీజీ రామ్‌జీ పథకానికి నిధుల కొరత ఉండబోతోందన్నది స్పష్టమవుతోందని ఆయన చెప్పారు. కేంద్రం తీసుకువచ్చిన వీబీజీరామ్‌జీ పథకాన్ని వ్యతిరేకిస్తూ ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పర్యటన చేశామన్న ఆయన దీనిపై వ్యవసాయ కూలీల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నది స్పష్టమైందని చెప్పారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త ఉద్యమాన్ని కాంగ్రెస్‌పార్టీ నిర్వహిస్తోందని ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రచ్చబండ కార్యక్రమాలు చేపడుతున్నారని ఆయన చెప్పారు. ఇందులో భాగంగా మంగళవారం సాయంత్రం షర్మిల కర్నూలు జిల్లాలో పర్యటించబోతున్నారని ఆయన తెలిపారు. సాయంత్రం 4.30 గంటలకు సి.క్యాంప్ సెంటర్‌లో దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం గార్గేయపురంలో జరిగే రచ్చబండ కార్యక్రమానికి షర్మిల హాజరవుతారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్‌పార్టీ శ్రేణులను, ప్రజలను ఆయన కోరారు.

# వైభవంగా శ్రీ ఉమామహేశ్వరుల కళ్యాణం





**బనగానపల్లెమేజర్,న్యూస్ః** యాగంటి శ్రీ ఉమామహేశ్వరస్వామి మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారంనాడు వేకువజామున ఉమామహేశ్వరుల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. శ్రీ ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం అర్థరాత్రి లింగోద్భవ పూజల అనంతరం సోమవారం వేకువజామున 4ః30గంటలకు శ్రీ ఉమామహేశ్వరస్వామి వారి కళ్యాణం అత్యంత రమణీయంగా వైభవంగా నిర్వహించారు. లింగోద్భవ పూజల్లో వైకాపా నంద్యాల జిల్లా అద్యక్షులు పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. లింగోద్భవ పూజల అనంతరం ఆలయ ఈ.ఒ పాండురంగా రెడ్డి ప్రత్యేక అధికారి సుధాకర్ రెడ్డి పర్యవేక్షణలో ఆలయ పరిసరాల్లో పెద్ద కోనేరు సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కళ్యాణ వేదిక వద్ద శ్రీ ఉమామహేశ్వరస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను కొలవుదీర్చి ఆలయ వేద పండితులు మహేష్ శర్మ, కిశోర్ శర్మ, వేద మంత్రోచ్ఛరనడుమ స్వామి వారి కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవంలో ఆలయ ఛైర్మెన్ బండి మౌళీశ్వరరెడ్డి దంపతులు పాల్గొన్నారు. శ్రీ మహేశ్వర స్వామి వారి కళ్యాణోత్సవాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

## వైభవంగా శ్రీపార్వతీ పరమేశ్వర కళ్యాణ రథమహోత్సవం

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడబూరు మండలంలోని దొడ్డి మేక ల.పెద్దకడబూరు గ్రామాలలో సోమవారం సాయంత్రము 6గంటల ప్రాంతంలో శ్రీపార్వతిపరమేశ్వర కళ్యాణ రథమ హత్సవం అశేష భక్త జన సమూహ ములమద్య అంగరంగా వైభవంగా జరిగింది. ముందుగా దొడ్డిమేకల గ్రామంలోని శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో ఉన్న శ్రీ శివపార్వతి పరమేశ్వర ఉత్సవమూర్తులకు భక్తులు ఉదయం తెల్లవారుజాము నుంచి మద్యాహ్నం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేరోజున తిరిగి సాయంత్రం 6 గంటల ప్రాంతంలో శివ పార్వతి పరమేశ్వర ఉత్సవ మూర్తులను మల్లి కార్జున స్వామి భక్తులు దేవాలయం నుండి మేళా తాళలతోను గ్రామంలో ఊరేగింపుగా వెళ్ళి పుష్పాలతో ఆలంక రించిన రథం దగ్గరకు వచ్చి అక్కడ శివపార్వతి పరమేశ్వర ప్రథిమలను రథంపై ఉంచాతారన్నారు. అక్కడ రథానికి శివభక్తులు ప్రత్యేక నైవేద్యములు సమర్పించిన ఆనంతరం వేలాది మంది భక్తులు రథాన్నిస్థానిక దేవాలయం నుండి ఎమ్మిగనూరు రోడ్డు వరకు రథాన్ని లాగి తిరిగి మళ్ళీ యధాస్థానంలో ఉంచారు.ఈరథాన్ని తిలకించేందుకు గ్రామం చుట్టూ ప్రక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్. ఎంపిటిసి టి. మల్లేష్. అధికార పార్టీ కి చెందిన నాయకులు నరసింహ రెడ్డి. కురువ అయ్యప్ప ప్రతాపరెడ్డి. బోయ ధర్మ రాజు. వైకాపా పార్టీ కి చెందిన నాయకులు శివరామిరెడ్డి. గజేంద్రరెడ్డి. వెంకటేశ్వర్ రెడ్డి లచ్చన్న రెడ్డి. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# కన్నుల పండువగా శ్రీకామేశ్వరీ సమేత మహానందీశ్వరస్వామి వార్ల కళ్యాణం

(మొదటి పేజీ తరువాయి)

మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. సోమవారం తెల్లవారు జామున శ్రీగంగాకామేశ్వరి సమేత మహానందీశ్వర స్వామివార్లను వధువరులుగా అలంకరించి ఉత్సవంగా కళ్యాణ వేదికకు చేర్చారు. ఆలయ ఇవో శ్రీనివాసరెడ్డి కళ్యాణ పెద్దలచే వేదపండితులు బ్రహ్మశ్రీ రవిశంకరఅవధాని, నాగేశ్వరశర్మ లతో పాటు ప్రత్యేక వేదమంత్రాలతో కళ్యాణ కార్యక్రమాలను భక్తులకు కన్నుల పండుగా నిర్వహించారు. గణపతి పూజ, కంకణధారణ, జీలకరబెల్లం, కళ్యాణదానం, మంగళదారణ, ముత్యాల తలంబ్రాలతో వేడుకలను వేదమంత్రాలతో నిర్వహించారు.

**భక్తులతో కిటకిటలాడిన క్షేత్రం :** మహానంది పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. క్షేత్ర పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

**ఉచిత నీరు, మజ్జిగ పంపిణీ :** మహానంది క్షేత్రానికి తరలివచ్చిన భక్తులకు పలువురు ఉచితంగా తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. కులసంఘాల వారు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. జిందాల్, యూనియన్ బ్యాంకు వారు ఉచితంగా తాగునీరును అందించారు.

**అశ్వవాహనంపై విహరించిన స్వామివార్లు :** మహానంది పుణ్యక్షేత్రంలో సోమవారం మహాశివరాత్రి పర్వదినం



స్వామివార్లను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం

రోజున అశ్వవాహానంపై ఆలయ మాడవీధులలో విహారించారు. ఉదయం స్వామివార్లను అశ్వవాహానంపై కొలువుదీర్చి ప్రత్యేక అలంకరణ చేశారు. వేదపండి



స్వామివార్లకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

తులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను నిర్వహించారు. భక్తుల ఓంకారనామస్మరణలతో పల్లకి ఉత్సవం అత్యంత వైభవంగా సాగింది.

## రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే



**గడివేముల మేజర్ న్యూస్ :** మహాశివరాత్రి పండగ సందర్భంగా గడివేముల మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపాన ఉన్న దక్షిణ కాశీగా పేరు పొందిన శ్రీ దుర్గా భోగేశ్వర స్వామి దేవస్థానం నందు సోమవారం నాడు ఆలయ చైర్మన్ కంది శ్రీనివాసులు ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి వృషభ బల ప్రదర్శన బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, నందికొట్కూరు టిడిపి ఇన్చార్జ్ గౌరు వెంకట్ రెడ్డి ప్రారంభించారు, ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ఒంగోలు జాతి వృషభ బలప్రదర్శన బండలాగుడు పోటీలు నిర్వహించడం చాలా సంతోషకరమన్నారు. సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబిం బించేలా ప్రతి సంవత్సరం మహా శివరాత్రికి నిర్వహించడం అభినందనీయమన్నారు. బం డలాగుడు పోటీలను తిలకించేందుకు ఇతర గ్రామాల నుండి పెద్ద ఎత్తున రైతులు, ప్రజలు హాజరు కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఒంగోలు జాతి వృషభ పోటీలలో 6 జతల వృషభ లు పాల్గొన్నాయని అందులో గెలుపొందిన వృషభ యాజమాన్యాలకుఆలయ కమిటీ చైర్మన్ కంది శ్రీనివాసులు ఆధ్వర్యంలో బహుమతులను అందజేస్తారని తెలిపారు. వృషబాల బాల ప్రదర్శన వద్ద ఎటువంటి సంఘటన జరగకుండా సిఐ కిరణ్ కుమార్ రెడ్డి, ఎస్సై నాగార్జున రెడ్డి గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు మాజీ మండలాధ్యక్షులు వంగాల శ్రీనివాస్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి,సింగల్ విండో అధ్యక్షులు దేశం సత్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ పంట దిలీప్ కుమార్ రెడ్డి, గిరిబాబు, సుకుమార్ చారి, నారాయణరెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు రమణారెడ్డి, షణ్ముఖ రెడ్డి, చిందుకూరు సర్పంచ్ అనసూయమ్మ, ధర్మకర్త సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## నేడు అహోబిలం ఆలయాలలో దర్శనం నిలిపివేత

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలోని ఆలయాలలో నేడు ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు దర్శనం నిలిపివేయడం జరుగుతుందని అహోబిలం చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వివిఎల్ రామానుజన్ సోమవారం తెలిపారు. మార్చి 20 నుండి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న సందర్భంగా నేడు కోయిల్ ఆల్వార్ తిరుమంజన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎగువ ,దిగువ అహోబిల ఆలయాలలో దర్శనం నిలిపివేయడం జరుగుతుందని భక్తులు సహకరించాలని ఆయన కోరారు.

## యాగంటిలో రైతు సంబరాలను ప్రారంభించిన బి.సి రామనాథ్ రెడ్డి



రైతు సంబరాలను ప్రారంభిస్తున్న దృశ్యం

**బనగానపల్లెరూరల్మేజర్,న్యూస్ః** యాగంటి శ్రీ ఉమామహేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా రైతు సంబరాలను ఏర్పాటు చేయడం జరిగింది. అందులో భాగంగా సోమవారంనాడు ఈ రైతు సంబరాలను రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి సోదరుడు బి.సి రామనాథ్ రెడ్డి నాలుగుపండ్ల విభాగము వృషభాల బలప్రదర్శనను ప్రారంభించారు. ఈ బలప్రదర్శన కార్యక్రమంలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.40వేలు, రెండవ బహుమతి రూ.30వేలు, మూడవ బహుమతి రూ.25, నాల్గవ బహుమతి రూ 20వేలు, ఐదవ బహుమతి రూ. 15వేలు, ఆరవ బహుమతి రూ. 10వేలు, ఏడవ బహుమతి రూ.8వేలు, ఎనిమిద బహుమతి రూ.5వేలు , తొమ్మిదవ బహుమతి రూ.3వేల రూపాయలుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బనగానపల్లె మార్కెట్యార్డు ఛైర్మెన్ కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి, వంగల పరమేశ్వర రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వర రెడ్డి, కాపులపల్లె సర్పంచ్ తులసి రెడ్డి, యాగంటి ఆలయ ఛైర్మెన్ బండి మౌళీశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముద్దాయి దేవదాసుకు జీవిత ఖైదు

### -హత్యకు అనుమానమే కారణం

(మొదటి పేజి తరువాయి)

**గోనెగండ్ల, మేజర్ న్యూస్:** అగ్రహారం గ్రామానికి చెందిన అంద్రి దేవదాసు అనే వ్యక్తి బైలుప్పల గ్రామానికి చెందిన హరిజన లక్ష్మి అనే వివాహితతో అక్రమ సంబంధం పెట్టుకొని నమ్మించి హత్య చేసి పెట్రోల్ పోసి కాల్చి బూడిద చేసిన కేసులో ముద్దాయి దేవదాసుకు ఆదోని రెండవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి పీజే. సుధా జీవితకాలం ఖైదు, రూ.10వేలు జరిమాన విధించినట్లు పోలీసులు తెలిపారు. కేసు విచారణ లోకి వెలితే బైలుప్పల గ్రామానికి చెందిన హరిజన లక్ష్మి గత కొంత కాలంగా అగ్రహారం గ్రామానికి చెందిన ఆంద్రి దేవదాసు తో అక్రమం సంబంధం పెట్టుకుంది. ఆరు నెలలు తరువాత లక్ష్మిపై ప్రవర్తన పై దేవదాసు కు అనుమానం వచ్చింది. దీంతో గతకొంతకాలంగా ఇద్దరి మధ్య గొడవలు జరిగేవి. అయితే దేవదాసు లక్ష్మిని హత్య చేయాలని పన్నాగం పన్నాడు. అందులో బాగంగా 07-06-2021న దేవదాసు లక్ష్మితో గుంతకల్లులోని చర్చిలో ప్రార్ధనలు చేసివద్దాం అని నమ్మించి తన ద్విచ క్రవాహనం పై కసాపురం గ్రామ పొలిమేరలోని సేసే చిన్న రంగన్న కు చెందిన పొలంలో ముళ్ల పొదల్లోకి తీసుకువెళ్లి లక్ష్మి గొంతు నులిమి చంపి శవంను ఇతరులు ఎవరు గుర్తు పట్టకుండా ఉండేందుకు గాను తన ద్విచక్రవాహనంలోని పెట్రోల్ను లక్ష్మిపై పోసి నిప్పుపెట్టాడు. గత ఆరు రోజులుగా లక్ష్మి కనిపించక పోవడంతో మృతురాలి తల్లి హరిజన క్రిష్ణమ్మ 13-06-2021న గోనెగండ్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు దర్యాప్తు చేసి దేవదాసు హత్య చేసినట్లు పోలీసులకు ఆధారాలు లభించడంతో దేవదాసును అరెస్టు చేసి కోర్టుకు హజరుపరచారు. కోర్డు లో నేడు నేర నిరూపణ కావడంతో ఆదోని రెండవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి పీజే. సుధా జీవిత ఖైదు విధించినట్లు గోనెగండ్ల సీఐ చంద్రబాబు తెలిపారు.

## రాయలసీమ ఉద్యాన హబ్‌కు రూ..30 వేల కోట్లు.. గిత్త

**- ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు ఎక్కడ జగన్..?**

**- పాత్రికేయులతో మాట్లాడుతున్న జయసూర్య**





**నందికొట్కూర్ రూరల్ మేజర్ న్యూస్ :** రాయలసీమ ఉద్యాన హబ్ కు బడ్జెట్ లో రూ.30 వేల కోట్లను రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కేటాయించడం పట్ల రాయలసీమ ప్రజాప్రతినిధులు హర్షించదగ్గ విషయమని నందికొట్కూరు శాసనసభ సభ్యుడు గిత్త జయసూర్య అన్నారు. సోమవారంస్థానిక పీ-4కార్యాలయంలో ఎమ్మెల్యే పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రూ.3,32,205 కోట్లతో ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో తీసుకెళ్లడంతో పాటు సంక్షేమాన్ని పరుగులు పెట్టించేలా ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం హాయంలో రాష్ట్రంలో ఎంతో నష్టం జరిగిందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి దిశగా అడుగులు ముందుకు వేస్తుందని తెలిపారు. గత 2019-24 లో జగన్ మోహన్ రెడ్డి రాయలసీమకు ఏ ఒక్క పైసా కూడా కేటాయించలేదన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు గత ఐదు సంవత్సరాల్లో ఎక్కడికి వెళ్లాయో నేటి వరకు చెప్పలేని పరిస్థితుల్లో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉన్నారని ఎద్దేవా చేశారు .ఎస్సీల సంక్షేమంకోసంబడ్జెట్లో రాష్ట్రంలోని పేద బడుగు బలహీన వర్గాల వారికి బడ్జెట్ ఆమోద పాత్రికేయులతో మాట్లాడుతున్న యోగమైందన్నారు .పేదవారి సొంత ఇంటి కల నెరవేర్చాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గత ఏడాది బడ్జెట్లో రూ.2 వేల కోట్లు కేటాయిస్తే ఈ ఏడాది రూ.6,357 కోట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు గుంజు పల్లె భాస్కర్ రెడ్డి, పగిడ్యాల టిడిపి మండల కన్వీనర్ పలుచాని మహేశ్వర రెడ్డి, టిడిపి నాయకులు లాయర్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైల క్షేత్ర పవిత్రత పరిరక్షణలో ఎక్సైజ్ శాఖ 'భేష్'

**-బ్రహ్మోత్సవాల విధుల్లో ప్రతిభ చాటిన 19 మందికి ప్రశంసా పత్రాలు**

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** శ్రీశైల మహా క్షేత్రంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, మత్తుపదార్థాల రహిత క్షేత్రంగా తీర్చిదిద్దడంలో ఎక్సైజ్ శాఖ కీలక పాత్ర పోషించింది. జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆదేశాల మేరకు ఎక్సైజ్ అధికారులు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో అత్యుత్తమ సేవలు అందించిన 19 మంది సిబ్బందిని జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి ఎస్.రవికుమార్ సోమవారం ప్రశంసా పత్రాలతో సత్కరించారు.అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.రాముడు సారథ్యంలో 7 మంది సీఐలు, 5 మంది ఎస్ఐలు మరియు 50 మంది సిబ్బందితో శ్రీశైల దేవస్థాన పరిధిలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సున్నిపెంట, సుగాలి కాలనీ, లింగాలగట్టు, శిఖరం, హాటకేశ్వరం, కైలాశద్వారం, మేకలబండ వంటి సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతరం నిఘా ఉంచారు. నాటుసారా, మద్యం, గంజాయి వంటి నిషేధిత పదార్థాలు క్షేత్రంలోకి రాకుండా అడ్డుకోవడంలో వీరు సఫలీకృతమయ్యారు.

**నందికొట్కూరు సిబ్బందికి గుర్తింపు:** విధుల్లో ప్రత్యేక ప్రతిభ కనబరిచి పలు కేసులు నమోదు చేయడంలో కీలక పాత్ర పోషించిన నందికొట్కూరు ఎక్సైజ్ స్టేషన్



సిబ్బందికి అధికారులు అభినందనలు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ శేఖరయ్య నాయుడు, కానిస్టేబుళ్లు సుధీర్ కుమార్, మధు ప్రసాద్, రమిజాబీలకు జిల్లా అధికారి రవికుమార్ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు సీఐ రామాంజనేయులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కమనీయం.. రమణీయం స్వామి వారి రథోత్సవం

**గోనెగండ్ల, మేజర్ న్యూస్:** మండల పరిధిలోని ఎస్.లింగందిన్నె గ్రామంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకోని సోమవారం సాయంత్రం గ్రామంలోని భక్తులు పార్వతి, పరమేశ్వర రథోత్సవం ను భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. స్వామి వారి రథోత్సవం కన్నుల పండుగగా కమనీయంగా సాగింది. ఈశ్వరదేవాలయం ను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఈ రథోత్సవం గ్రామంలోని ఈశ్వర దేవాలయం నుంచి పురవీదుల గుండా



సాగింది. రథోత్సవం ఆధ్యంతం శివనామస్మరణతో మారుమోగిపోయింది. హరహర మాహాదేవ శంభోశంకర అంటు మహిళలు, యువకులు, వృద్ధులు, భక్తులు, శివస్వాములు నినాధాలు చేశారు. ఈ ప్రభోత్సవం కార్యక్రమంకు లింగందిన్నె కాక కున్నూరు, వీరంపల్లి, బోదేపాడు, తిప్పనూరు,వేముగోడు గ్రామాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు. కుంకుమ అర్చన, ఆకుపూజ, మహామంగళహారతి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

### గుండ్లబ్రహ్మేశ్వర దేవస్థానాన్ని

## సందర్శించిన భక్తులు

**వెలుగోడు, మేజర్న్యూస్ :** నల్లమల అడవి ప్రాంతంలో వెలసిన గుండ్ల బ్రహ్మేశ్వర క్షేత్రానికి పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. ఈ క్షేత్రానికి బండిఆత్మకూరు మండలంలోని నారాయణాపురం, దిగువమెట్ట ప్రాంతం నుంచి భక్తులు వచ్చే వారు ఈ ఏడాది వెలుగోడు ప్రాంతం నుంచి పాపినేనిపల్లె ప్రాంతం నుంచి భక్తులు రావడానికి డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్, మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్, శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్రెడ్డి చొరవతో అటవీ శాఖ ప్రత్యేక అనుమతి ఇవ్వడంతో భక్తులు విరివిగా తరలి వచ్చారు. దేవస్థానం చైర్మెన్ జయరామిరెడ్డి, కార్యదర్శి నారాయణ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం బిల్వార్చన, కుంకుమార్చన, తదితర పూజలు స్వామి వారికి శాస్త్రోక్తంగా నిర్వహించారు. నంద్యాల ప్రముఖ లాయర్ తులసిరెడ్డి, న ంద్యాల మున్సిపల్ కమిషనర్స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు.

## బండలాగుడు పోటీల్లో వెంకటగిరి వృషభాలకు ప్రథమ బహుమతి



**కృష్ణగిరి,మేజర్న్యూస్ :** మండలపరిధిలోని చుంచుఎర్రగుడి గ్రామంలో శ్రీ రామలింగేశ్వర స్వామి తిరుణాల సందర్భంగా వృషభాలకు బండలాగుడు పోటీలు నిర్వహించారు.ఈ పోటీలలో కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన శశాంకశ్రే య వృషభాలు ప్రథమ స్థానం సాధించగా అలాగే మరో జత ఆయనకు సంబంధించిన వృషభాలే ద్వితీయ స్థానాన్నికైవసం చేసుకు న్నాయి. ముందుగా కర్నూలు ఎంపి నాగరా జు వృషభాల బండలాగుడు పోటీలను ప్రారంభించారు. శ్రీ రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నవితరణ కార్యక్రమంతో పాటు ,వృషభాలకు బండలా గుడు పోటీలను ప్రారంభించారు.తృతీయ బహుమతిని డోన్ మండలం శిసంగుంతల గ్రామానికి చెందిన ఆలా మదన్మోహన్రెడ్డి వృషభాలు నాల్గవ బహుమతి డోన్ మండ లం కొచ్చెరువు గ్రామానికి చెందిన ఉమాదేవి వృషభాలు ,ఐదవ బహుమతిని డోన్ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన పెద్దసోమన్న వృషభాలు సాధించాయి. **దాతలు :** బండలాగుడు పోటీలలో ప్రథమ బహుమతిని సాధించిన వృషభాల యజమా నులకు దాత పెద్ద మద్దిలేటి రూ.40,116 లను ద్వితీయ బహుమతి దాత జి.చిన్న మద్దిలేటి రూ.30,116లు, మూడవ బహు మతి దాతజి.నడిపిమద్దయ్య ,జి.చిన్న మద్దయ్య సంయుక్తంగా రూ.20,116లు అందించారు.అలాగే నాల్గవ బహుమతి దాత ఎస్.రవి కుమార్ రూ.10,116లు, ఐదవ బహుమతిని దాత జి.బాలరంగడు రూ.5,116లు అందజేశారు.అలాగేకబ్బడీ పోటీలు నిర్వహించి గెలుపొందిన ప్రథమ విజేత గోనెగండ్ల జట్టుకు దాత ఈ.వీరశేఖర్ గౌడు రూ.20 వేలు అందించారు.అలాగే ద్వితీయ బహుమతి విజేత పంచలింగాల జట్టుకు రూ.15వేలను,గొంగళ్ల తిమ్మన్న అందజేశారు.తృతీయ బహుమతిని విజేత టి.కోటకొండ జట్టుకు దాతచిన్న తిమ్మన్న రూ.10వేలను అందించారు. నాల్గవ బహుమతి విజేత పెద్దదొడ్డి జట్టుకు రూ.5వేలను ఎల్.ఈ చిన్న రంగడు అందజేశారు. నాయకులు ప్రకాష్గౌడు, శేఖర్గౌడు,మాజీ సర్పంచులు మద్దిలేటి ,రామాంజనేయులు,పుల్లన్న,మాజీ ఎంపిటిసి సభ్యులు కత్తి నాగేష్,బాలు,ఇంకా పలువురు పాల్గొన్నారు.

# రంజాన్ ఏర్పాట్లపై ఎమ్మెల్యే బీవీ సమీక్షా

**- ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్:** పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా వాటి ఏర్పాట్లపై ముస్లిం మత పెద్దలు, అధికారులతో ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వర రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ముస్లిం మత పెద్దలు హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష నిర్వహించే ముస్లిం సోదరులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రధానంగా మసీదుల పరిసరాల్లో పారిశుధ్యం మెరుగుపరచడం, ప్రార్థన సమయాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడడం, శాంతి భద్రతల పరిరక్షణ, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన, రాత్రి సమయంలో అవసరమైన లైటింగ్ ఏర్పాట్లు వంటి అంశాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పవిత్ర రంజాన్ మాసం ప్రశాంతంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరగాలని, ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని ఎమ్మెల్యే బీవీ భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, పట్టణ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ మధుసూదన్ రెడ్డి, మసీదు కమిటీ సభ్యులు, స్థానిక మైనార్టీ ప్రతినిధులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణం..కమనీయం..రమణీయం



**గడివేముల మేజర్ న్యూస్:** ఎర్రమల కొండల్లో వెలిసిన శ్రీ దుర్గా భోగేశ్వర స్వామి దేవస్థానం నందు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి కల్యాణాన్ని ఆలయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కంది శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేదమంత్రాలు, భాజా భజంత్రీల మధ్య స్వామివారి కల్యాణాన్ని అర్చకులు శ్యామసుందర్ శర్మ, గిరిధర్ శర్మ కనుల పండుగగా నిర్వహించారు. కళ్యాణాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. కళ్యాణమునకు ఎస్సై నాగార్జున రెడ్డి దంపతులు మరియు ఆలయ అధికారి చంద్రశేఖర్ రెడ్డిదంపతులు అమ్మవారి తరపున తహసిల్దార్ వెంకటరమణ కల్యాణంలో పాల్గొన్నారు.కళ్యాణం అనంతరంఉత్సవ విగ్రహాలను ఘనంగా ఊరేగించారు.

# అహోబిలం చేరుకున్న 46వ పీఠాధిపతి



**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఎగువ మరియు దిగువ అహోబిలంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న తరుణంలో,క్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణం మొదలైంది. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీ అహోబిలం మఠం 46వ పీఠాధిపతి శ్రీవన్ శఠగోప శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి సోమవారం సాయంత్రం అహోబిలం చేరుకున్నారు. బ్రహ్మోత్సవాల పర్యవేక్షణ నిమిత్తం పీఠాధిపతి సోమవారం ఉదయం గంటలకు చెన్నైలోని అహోబిలం మఠం నుండి తన శిష్య పరివారంతో కలిసి బయలుదేరారు. సాయంత్రం వేళకు వారు క్షేత్రానికి చేరుకోగానే మఠం సీఈవో రామానుజన్, ప్రధాన అర్చకులు వేణుగోపాలన్ ,అర్చకులు మరియు భక్తులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి పర్యవేక్షణలో విశేష పూజలు, వాహన సేవలు నిర్వహించనున్నారు. పీఠాధిపతుల రాకతో అహోబిల మఠం మరియు ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. భక్తులు పెద్దఎత్తునతరలివచ్చిస్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు.

## ఘనంగా తిమ్మ గురుడు స్వామి, పక్కీరప్ప స్వామి రథోత్సవ వేడుకలు

**తుగ్గలి,మేజర్ న్యూస్:** మండల పరిధిలోని బోడుబండ అటవీ ప్రాంతంలో వెలసిన తిమ్మగురుడు స్వామి, పక్కీరప్ప స్వాముల రథోత్సవ వేడుకలు సోమవారం సాయం త్రం అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. మొదట తిమ్మగురుడుస్వామి రథోత్సవ వేడుకలు జరిగాయి. అటు తర్వాత పై కొండలోని పక్కీరప్పస్వామి రథోత్సవ వేడుకలు జరిగాయి. ఈ రథోత్సవ వేడుకలను చూసేందుకు వేలాది మంది ప్రజలు బోడుబండకు తరలిరావడంతో బోడుబండ జనసమూహంతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు సుదర్శన్ రెడ్డి, అప్పా వేణు గోపాల్, సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, నిర్వాహకులు అప్పా వెంకటేష్అశోక్ రెడ్డి, అర్చకుడు,రిటైర్డ్ హెచ్ఎం కృష్ణయ్య ఆచారి, ఆంజనేయ స్వామి తాత వంశీకులు మదనంతపురం పశుల శ్రీరాములు,తదితరులు రథోత్సవ వేడుకలకు వచ్చే భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను చేశారు. జొన్నగిరి ఎస్సై ఎన్. సి. మల్లికార్జున ఆధ్వర్యంలో జొన్నగిరి పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



# జేఈఈ మెయిన్స్‌లో 'ఎస్‌డీఆర్ ఆకాంక్ష' విద్యార్థుల ప్రభంజనం

**- 99.41 పర్సెంటైల్‌తో చరిత్ర సృష్టించిన అంజన్ సాహిత్ బాషా**
**- పది మందికి 95 పర్సెంటైల్‌పైగా మార్కులు**
**- హర్షం వ్యక్తం చేసిన కళాశాల చైర్మన్ ఎస్. కొండా రెడ్డి**





**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** జాతీయ స్థాయి ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష 'జేఈఈ మెయిన్స్-2026' ఫలితాల్లో స్థానిక ఎస్‌డీఆర్ ఆకాంక్ష జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. సోమవారం విడుదలైన ఫలితాల్లో కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు అత్యుత్తమ పర్సెంటైల్‌తో జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ప్రతిభ చాటిన అంజన్ సాహిత్ బాషా, బాలిరెడ్డి కళాశాల విద్యార్థి అంజన్ సాహిత్ బాషా 99.41 పర్సెంటైల్ సాధించి అగ్రస్థానంలో నిలవగా, మరో విద్యార్థి బాలిరెడ్డి 99.15 పర్సెంటైల్‌తో మెరిశారు. వీరితో పాటు కవిత, సాజ్వా, మంజులత, కీర్తివర్షిణి సహా మొత్తం 10 మంది విద్యార్థులు 95 పర్సెంటైల్ కంటే ఎక్కువ మార్కులు సాధించి కళాశాల కీర్తిని చాటారు. అలాగే మరో 20 మంది విద్యార్థులు 90 పర్సెంటైల్‌కు పైగా సాధించి జేఈఈ అడ్వాన్స్‌డ్ అర్హత దిశగా అడుగులు వేశారు.

**కృషికి దక్కిన ఫలితం:** విద్యార్థుల ఘన విజయంపై కళాశాల చైర్మన్ ఎస్. కొండా రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధమైన బోధన, విద్యార్థుల కఠోర శ్రమ వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో కళాశాలకు గుర్తింపు తెచ్చిన విద్యార్థులను, వారికి వెన్నంటి ఉండి ప్రోత్సహించిన అధ్యాపక బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# గంజహాళ్లి ఉరుసుకు ఎంపీ నాగరాజకు ఆహ్వానం

**గోనెగండ్ల, మేజర్ న్యూస్:** మండల పరిధిలోని గంజహాళ్లి గ్రామంలో వెలసిన బడేసాహెబ్ స్వామి వారి ఉరుసు మహోత్సవంకు కర్నూలు ఎంపీ బస్తీపాటి నాగరాజును గంజహాళ్లి దర్గా పీఠాధిపతులు స్వామి వారి ముని మనవళ్లు ముద్దగోలుస్వామి, పూలబాషస్వామి సోమవారం ఆహ్వాన పత్రికి ఇచ్చి స్వామి వారి ఉరుసు మహోత్సవం కు రావాలని సాధరణంగా ఆహ్వానించారు. స్వామి వారు ఉరుసు ఈ నెల 22 న గంధం, 23న ఉరుసు, 24న జియారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురువ కార్పోరేషన్ డైరెక్టర్ రామకృష్ణ ఏపీయ డబ్లుజే తాలుకా ఉపాధ్యక్షుడు కట్టుబడి ఖలీల్ పాల్గొన్నారు.



ఉరుసుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న పీఠాధిపతులు

# ప్రజా సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు సీపీఎం వినతి

**ఆదోనిటౌన్, మేజర్‌న్యూస్:** ఆదోని పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు ఈరన్నతో పాటు గోపాల్, తిప్పన్న, వీరేష్, నాగరాజు, వెంకటేష్, అజీమ్ ఖాన్ లు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ నయూం మహమ్మద్‌ని సోమవారం కలిశారు. శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజా సమస్యలను ఆయనకు వివరించారు. సమస్యలపై వినతి పత్రం అందజేసి, పట్టణ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 165 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఆదోని మున్సిపాలిటీ కర్నూలు జిల్లాలోనే ప్రాచీన మున్సిపాలిటీలలో ఒకటిగా గుర్తింపు పొందిందన్నారు. రెండవ ముంబయిగా ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ పట్టణం పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి ఆమడ దూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా పాత ఫ్లైఓవర్ వంతెన ప్రమాదకర స్థితిలో ఉండి ఎప్పుడైనా కూలే పరిస్థితిలో ఉందని, దీనివల్ల ప్రజలు ప్రతిరోజూ భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. వెంటనే మరమ్మతులు లేదా పునర్నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా మున్సిపాలిటీ షాపింగ్ కాంప్లెక్స్ పనులను వేగవంతంగా పూర్తిచేసి వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని కోరారు. పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకుని రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలని సూచించారు. ప్రజలకు విశ్రాంతి, పిల్లలకు వినోదం కల్పించేలా పట్టణంలో మరిన్ని కొత్త పార్కులు ఏర్పాటు చేయడంతో పాటు, ఉన్న పార్కుల్లో అవసరమైన వసతులు, ఆట పరికరాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ జనాభాకు అనుగుణంగా అదనంగా మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.




కమిషనర్ కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

## కమనీయం మల్లికార్జునస్వామి భ్రమరాంబికాదేవీల కళ్యాణం

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండల కేంద్రంలో సోమవారం శ్రీ మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి కళ్యాణం కమణీయంగా కన్నుల పండువగా నిర్వహించారు. కొండపై వున్నా ఆలయం నుండి దేవతమూర్తుల విగ్రహాలను కల్యాణ మండపానికి తీసుకొచ్చి పురోహితుల సమక్షంలో కళ్యాణం వైభవంగా నిర్వహించి అనంతరం సాయంత్రం దేవతమూర్తులను గ్రామంలో ఊరేగింపు నిర్వహించి శివరాత్రి ఉత్సవాలను ఘనంగా ముగించారు.

**హోరా హోరీగా సాగిన ఎద్దుల బండలాగుడు పోటీలు :** మండలంలో శివరాత్రి ఉత్సవాలలో భాగంగా స్థానిక అప్పన్న స్వామి ఆలయం ప్రాంగణంలో నిర్వహించిన రెండు పండ్ల ఎద్దుల బండలాగుడు పోటీలను అట్టహసంగా ప్రారభించారు. ఈపోటీలో మొత్తం ఏడు జతలు పాల్గొనగా ప్రతి జతకు 10నిముషాల మాత్రమే సమయం నిర్ణంచారు. హోరా హోరీగా సాగిన పోటీలో నిర్ణిత సమయంలో 2116అడుగులు లాగి మొదటి స్థానంలో గొల్ల బజారి ఎద్దులు నిలువగా అందుకు దతగాలు గొల్ల రామన్న మనుమలు 15016రూపాయల బహుమతి అందించారు. 1836అడుగులు లాగి రెండవ స్థానంలో నిలిచిన గొల్ల నారాయణ జతలకు దాతలు అడవి రాముడు కుటుంబ సభ్యులు 10000 రూపాయల బహుమతి అందించారు. 1500 లాగి సంయుక్త విజేతలుగా నిలిచిన నడిపి తిప్పన్న గారి మల్లేష్ మరియు ముందటింటి తిరుపతయ్య జతలకు చెరో 6000 దాతలు నిమ్మకాయల మద్ది, కురువ నాగరాజులు అందించారు. 1250అడుగుల లాగి ఐదో స్థానంలో నిలిచిన రహంతుల్లా జతకు దాతలు మద్దికేరి రామాలింగు 2500రూపాయల బహుమతి అందించారు. 6,7స్థానంలో నిలిచిన ఎద్దులకుచెరో1000చొప్పునప్రోత్సహకబహుమతులు అందించారు.



వైభవంగా సిద్ధలింగేశ్వరస్వామి

# ఉచ్చాయోత్సవం

**హొళగుంద,మేజర్‌న్యూస్ః**


హొళగుంద మండలం ముద్దటమాగి గ్రామంలో సోమవారం శ్రీ సిద్ధలింగేశ్వర స్వామి ఉచ్చాయోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని గ్రామ భక్తులు స్వామి వారికి ప్రత్యేకంగా పూజలను నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆశేష భక్తజనుల మధ్య స్వామి ఉచ్చాయోత్సవాన్ని భక్తులు లాగారు. ఈ ఉచ్చాయోత్సవానికి వివిధ పార్టీల నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గ్రామంలో ఉచ్చాయోత్సవంను నిర్వహిస్తున్న భక్తులు

## రాష్ట్ర బడ్జెట్ పేద వర్గాలకు
# విజన్ డాక్యుమెంట్

- సంక్షేమం అభివృద్ధి అంశాలపై బ్లూ ప్రింట్ ఇచ్చేసింది
- ఎమ్మెల్యే బి.వి జయనాగేశ్వర రెడ్డి



సమావేశంలో మాట్లాడుతూన్న ఎమ్మెల్యే బి.వి

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రజల జీవితాలు మార్చేందుకు కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన 2026-27 బడ్జెట్ విజన్ డాక్యుమెంట్‌గా ఉందని, రాష్ట్ర భవిష్యత్‌కు దిశ, దశను మార్చే బడ్జెన్‌ను రూపొందించడంతో సంక్షేమం, అభివృద్ధి రాష్ట్ర ప్రజలకు వరంలా అందించి బ్లూ ప్రింట్‌లాంటి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడం జరిగిందని రాష్ట్ర పద్దుల కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే బి.వి జయనాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. సోమవారం విలేఖర్లతో ఎమ్మెల్యే బి.వి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలే లక్ష్యంగా వ్యవసాయ రంగాన్ని ఆదుకునేందుకు పరిశ్రమలు, సాగునీరు, విద్య, వైద్యం, పర్యటకం, గ్రామీణ, పంచాయతీ అభివృద్ధి, మహిళ సంక్షేమ లాంటి రంగాల్లో పురోభివృద్ధి సాధించే దిశగా బడ్జెట్ ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రత్యేక నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. రూ. 3.32 లక్షల కోట్లతో ప్రవేశ పెట్టిన బడ్జెట్ పేదలకు న్యాయం జరిగేలా ఉన్నందున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# రమణీయం రామలింగేశ్వరుడి రథోత్సవం

- శివనామస్మరణంలో మార్మోగిన గురజాల
- పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే బీవీ, వైకాపా ఇన్‌ఛార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి

**నందవరం, మేజర్‌న్యూస్ :** మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నందవరం మండలం గురుజాల గ్రామంలో తుంగభద్ర తీరాన వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం విశిష్ట పూజలు నిర్వహించారు ఆలయ పూజారి హంపి స్వామి. పార్వతి, పరమేశ్వర ఉత్సవ విగ్రహాలను ఆలయం పల్లకి ఉత్సవం నిర్వహించారు. అనంతరం రథాంగ హోమం చేపట్టారు. వేధమంత్రోచ్ఛారల మధ్య శివపార్వతులు మహారథంపై ఆశీనులను చేశారు. మహారథాన్ని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బి.వి జయనాగేశ్వర రెడ్డితో పాటు భక్తులు కలిసి లాగారు. శంభో శంకరా.. హారహార మహాదేవా అంటూ సాగిన రథోత్సవం రథంగం మండపం వరకు వెళ్లి హారహార ధ్వనుల మధ్య ఆలయ ప్రాంగణం వరకు లాగారు. ఈ రథోత్స కార్యక్రమంలో ఎమ్మిగనూరు వైకాపా ఇన్‌చార్జి ఎర్రకోట రాజీవ్ రెడ్డిలతో పాటు వివిధ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ముందుగా వీరు రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని అభిషేకం నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు అశేషంగా తరలివచ్చిన భక్తజనం మధ్య గ్రామ వీధుల్లో ఉత్సవ మూర్తులు దర్శన భాగ్యం అందించారు. మహా రథోత్సవాన్ని కవిత నల్లారెడ్డి ఇంటి నుండి కుంభం తీసుకొచ్చారు. ఈ రథోత్సం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటంలను జరగకుండా డిఎస్పీ భార్గవి ఆధ్వర్యంలో రూరల్ సీఐ చిరంజీవి, నందవరం ఎస్ఐ తిమ్మారెడ్డి గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.



రామలింగేశ్వర స్వామి రథోత్సవం తిలికించేందుకు తరలివచ్చిన భక్తులు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బీవీ



రథోత్సవంలో పాల్గొన్న వైసీపీ ఇన్‌చార్జి రాజీవ్ రెడ్డి

# నేత్రపర్వంగా బుగ్గ రామేశ్వరుడి కల్యాణం

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ఓర్వకల్లు మండలంలోని శ్రీ బుగ్గ రామేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం తెల్లవారుజామున బుగ్గ రామేశ్వర స్వామి వారి కల్యాణం ఆలయ ఈఓ, ధర్మకర్త మండలి సభ్యులు కళ్యాణ దాతలు నేత్రపర్వంగా నిర్వహించారు. మండల పరిధిలోని కన్నమడకల, నన్నూరు, లొద్దిపల్లె, ఉప్పలపాడు గ్రామాలతో పాటు మండల వ్యాప్తంగా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారికి శాస్త్రోక్తంగా కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా నూతన పట్టువస్త్రాలతో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కళ్యాణ మండపానికి పల్లకిలో బాజా భజంత్రీల నడుమ ఘనంగా తీసుకెళ్లారు. కళ్యాణ మండపంపై అధిష్టించిన స్వామి, అమ్మవార్లకు వేద పండితులు వేదమంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా వివాహ తంతు నిర్వహించారు. స్వామి వారి కళ్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఈఓ మద్దిలేటి దంపతులు, కమిటీ చైర్మన్ కాటినేని నారాయణ దంపతులు కళ్యాణ దాతలు పెద్దలుగా వ్యవహరించారు.



స్వామి వారికి కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

**ఉత్సవమూర్తుల ఊరేగింపు :**
బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తులను ఉదయం సింహవాహనం, నంది వాహనంపై ఆలయ పరిసరాల్లో ఘనంగా ఊరేగించారు. భక్తజనం శివనామస్మరణతో మారుమోగుతుండగా అర్చకులు వేదమంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవం వైభవంగా సాగింది.

**అలరించిన సినీ సంగీత విభావరి :**
ఆదివారం రాత్రి నిర్వహించిన సినీ సంగీత విభావరిని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నందికోట్కూరు ఇంచార్జ్ గౌరు వెంకటరెడ్డి దంపతులు, టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్ దంపతులు, టిడిపి నాయకులతో కలిసి ప్రారంభించారు. ఆర్‌జే సౌండ్స్ బృందం, రమేష్ మాస్టర్ ( గాజువాక) ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత కార్యక్రమం ప్రేక్షకులను ఆకట్టుకుంది. వలి టీం ప్రదర్శించిన సాంస్కాతిక నృత్య విన్యాసాలు ప్రేక్షకులను మంత్రముగ్దులను చేశాయి. చి అనంతరం అతిథులు ప్రేక్షకుల మధ్య కూర్చొని కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా కళాకారులకు బుగ్గ రామేశ్వర స్వామి చిత్రపటం అందచేసి శాలువాలతో సన్మానించారు.



కళాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే దంపతులు



స్వామి వారిని సింహవాహనంపై ఊరేగిస్తున్న దృశ్యం

# ఘనంగా స్టెఫెన్ ప్రతిష్ఠ ఆరాధన దినోత్సవం



సీపెన్ దేవాలయం ప్రతిష్టిస్తున్న ది రైట్ రెవరెండ్ సంతోష్ ప్రసన్నరావు

**చాగలమర్రి, మేజర్‌న్యూస్:** మండలంలోని పెద్దబోధనం గ్రామంలోని పి.ఎస్.ఐ పరిశుద్ధ సిఫెన్ చర్చి ప్రతిష్ట మహోత్సవం సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. నంద్యాల అద్యక్ష ఖండం బిషప్ ది రైట్ రెవరండ్ సంతోష్ ప్రసన్నరావు ప్రత్యేక ప్రార్థనలు సంగీత వాయిద్యాలు, కీర్తనల మధ్య నూతన చర్చిని ప్రారంభించారు. ముందుగా చర్చి వద్దకు చేరుకున్న బిషప్ చర్చి ఫాస్టర్ ఛైర్మెన్ రెవరెండ్ రవీంద్రనాథ్ డీనరీ ఛైర్మెన్ ఐ.జె ప్రసన్న కుమార్ సంఘం పెద్దలు క్రైస్తవ సోదర సోదరీమణులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గుడి ప్రదక్షిణ ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రతిష్ట సందర్భంగా క్రైస్తవ భక్తులను ఉద్దేశించి బిషప్ ప్రసన్నరావు ప్రసంగిస్తూ పరిశుధ్య స్టీఫెన్ అథసాక్షి అయిన దినమును ఈ దేవాలయం నామకరణమైన పరిశుధ్య స్టీఫెన్ చర్చిని ప్రతిష్టించుకోవడం మనందరికీ ఎంతో సంతృప్తి దాయకమన్నారు. పరిశుధ్య స్టీఫెన్‌ను ఆనాడు రాళ్లతో కొట్టి అతఃసాక్షిగా మార్చినా కూడా క్షమించమని కోరుకున్నారన్నారు. క్షమా శాంతియుత సమాధానం ప్రేమ, దయ కలిగి జీవనం గడపాలన్నారు. ప్రతిఒక్కరూ అధ్యాత్మికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. అనంతరం బిషప్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురువులు రెవరెండ్ జి.వి చంద్రశేఖర్, కొరియా ప్రతినిధి రెవరెంట్ డాక్టర్ కిమ్ రుక్సానా, గురువులు గాలిపోతు సంపత్ సౌందర్యరాజు, ఏసేబ్, రవికుమార్, సువార్తరాజు, ఇమ్మానియల్‌తోపాటు రాయలసీమ డయాసిస్‌కు చెందిన రాయచోటి స్టిఫెన్ ఫ్లోరిడా సంఘం సభ్యులు దానం, డాక్టర్ ప్రకాష్ , పీట్ల విజయ్ భాస్కర్, ప్రసాద్, స్వామిదాసు, భాస్కర్ తోపాటు వెటర్నరీ డాక్టర్ వరప్రసాద్, భూషనం, సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



గుడి ప్రదర్శన చేస్తున్న దృశ్యం

## సమస్యలను నాణ్యతతో పరిష్కరించండి


ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న డీఆర్వో రామునాయక్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్** :ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ప్రతి దరఖాస్తును నాణ్యతతో పరిష్కరించాలని డీఆర్వో రామునాయక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా వేదిక ద్వారా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా డీఆర్వో రామునాయక్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని పరిశీలించి సంబంధిత శాఖలకు సరైన విధంగా కేటాయించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పరిష్కరించిన అర్జీలపై అర్జీదారుల సంతృప్తి స్థాయిని కూడా సమీక్షిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 34దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.

## 17న జూలెపల్లెలో ధార్మిక ప్రవచనాలు


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల నియోజకవర్గంలోని గోస్పాడు మండలం జూలెపల్లె గ్రామంలో వెలసిన శ్రీసాయిబాబా మందిరంలో ఈనెల 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు తెలుగు పండితులు డాక్టర్ నరేష్ బాబుచే ధార్మిక ప్రవచనాలు, బాలకృష్ణ, రామకృష్ణ భజన మండలంచే భజన, శుక్రవారం ముక్కోటి దేవతా స్వరూపమైన గోపూజ, కుంకుమార్చన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి కరపత్రాలను స్థానిక భక్త మండలిచే ఆవిష్కరింపచేశారు. ఈకార్యక్రమంలో సుబ్బరాయుడు, శివ, మంజుల నాయుడు, కుమార్, వాణి, సురేష్‌లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న వక్తలు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :**నంద్యాల శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాలలో కెరీర్ అభివృద్ధి సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక వారపు సర్టిఫికేషన్ కార్యక్రమం రియల్ వరల్డ్ అప్లికేషన్ల అభివృద్ధికి పైథాన్ ఫుల్ స్టాక్ గురించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈకార్యక్రమం ద్వారా విద్యార్థులకు పరిశ్రమలకు అనుగుణమైన నైపుణ్యాలను అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు చురుకుగా పాల్గొని తమ సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరుచు కోవాలన్నారు. ఇటువంటి పరిశ్రమ ఆధారిత సర్టిఫికేషన్ కార్యక్రమాలు విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతాయన్నారు. డీన్ డేవిడ్ సుకీర్తికుమార్ మాట్లాడుతూ విద్యార్థుల ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం లక్ష్యంగా నిర్వహిం చామన్నారు. ఈకార్యక్రమంలో శైలజ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనుకు సన్మానం


నంద్యాల అయోధ్య నమూనా ఎగ్జిబిషన్ నిర్వాహకుడు శ్రీనును సన్మానిస్తున్న దృశ్యం

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల ప్రమథనంది ఆలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన నంద్యాల అయోధ్య నమూనా ఎగ్జిబిషన్ నిర్వాహకుడు శ్రీనును సీనియర్ ఫోటో గ్రాఫర్ చింతలపల్లి వాసు ఆధ్వర్యంలో పలువురు ఘనంగా సత్కరించారు. పట్టణంలోని శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో ఆత్మీయ సత్కార కార్యక్రమానికి రామకృష్ణ డిగ్రీ కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, సూరన సారస్వత సంఘం అధ్యక్షులు డాక్టర్ గెలివి సహదేవుడు, జిల్లెల్ల శ్రీరాములు తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎగ్జిబిషన్‌లో అయోధ్య రామాలయం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని శ్రీను ఎంతో సృజనాత్మకంగా ఆలయ నమూనాను ఏర్పాటు చేశారని బాలరాముని ప్రతిమ ఈ ప్రాంత వాసులను ఎంతో అలరించిందన్నారు. డాక్టర్ సహదేవుడు బాలరాముని వైభవాన్ని వివరించారు.

## కరాటే బెల్ట్ పోటీలలో విద్యార్థుల ప్రతిభ



గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని సాయిబాబానగర్ శ్రీశైల పాఠశాల ఆవరణంలో షిటో కై కరాటే అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి షిహాన్ షేక్ నూర్‌బాషా ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఈపోటీలలో 120మంది కరాటే విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 55మంది పసుపు బెల్ట్, 45మంది ఆరెంజ్ బెల్ట్, 6మంది గ్రీన్ బెల్ట్, 2 బ్లూ బెల్ట్, 5ఊదా బెల్ట్, ముగ్గురు బ్రౌన్ బెల్ట్‌లను సాధించగా మహమ్మద్ జునైద్, దినేష్‌లు బ్లాక్‌బెల్ట్‌లు సాధించినట్లు నూర్ బాషా తెలిపారు. ఏపీ కరాటే అ సోసియేషన్ వైస్ చైర్మన్ సోమశేఖర్‌రెడ్డి, ఏపీ షితో కై కరాటే అసోసియేషన్ అధ్యక్షులు షిహా న్ ఆరిఫ్, చీఫ్ టెక్నికల్ కమిషన్ మాస్టర్ ఫయాజ్‌లు విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

# పని ఒత్తిడి తగ్గించాలంటూ వీఆర్ఓల నిరసన



తహశీల్దార్ కార్యాలయ ఎదుట నిరసన తెలియజేస్తున్న విఆర్ఓలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** విఆర్ఓలకు పని ఒత్తిడి పెరగడం, అధికారుల తీరు మారకపోవడంతో కొందరు విఆర్ఓలు ఆత్మహత్యలకు పాల్పడితే మరి కొందరు ప్రమాదాలకు గురై చనిపోతున్నారని, విఆర్ఓలకు పని ఒత్తిడి తగ్గించాలంటూ నిరసన తెలియజేస్తున్నామని విఆర్ఓలు భాస్కర్, షాలు, చంద్రపాల్, సోమశేఖర్, రషీద్, వెంకటరమణ, గౌసాని,శ్రీలక్ష్మి, నూర్జహాన్‌లు అన్నారు. సోమవారం రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం పిలుపు మేరకు తహశీల్దార్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జిలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పని ఒత్తిడి వల్ల విఆర్ఓలు ఎలాంటి అగాయిత్యాలకు పాల్పడుతూ తొందరపాటు నిర్ణయాలు తీసుకోవవద్దని, రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ప్రతి విఆర్ఓకు, వారి కుటుంబాలకుత అండగా ఉంటుందని అన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో రెవెన్యూ, జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారులకు సమన్వయం లేకపోవడం వల్ల క్షేత్ర స్థాయిలో విఆర్ఓలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. డిపార్ట్‌మెంట్‌లో ఏ జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వహించాలో విఆర్ఓలో ఆయోమయ పరిస్థితుల్లో పనిఒత్తిడితో కొట్టు మిట్టాడుతున్నారని అన్నారు. ఓ పక్క రెవెన్యూ అధికారులు మరో పక్క జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారులు వారు చెప్పిన పనిచేయాలని ఒత్తి చేస్తున్నారని, తక్కువ సమయంలో ఎక్కువ పని అప్పగిస్తు పూర్తి చేయాలని ఖరాఖండిగా చెబుతుండడంతో ఏమి చేయలేని దుస్థితిలో విఆర్ఓలు మానసిక ఒత్తిడి గురవుతున్నారని అన్నారు. జనవరి 12వ తేది నుంచి వర్క్‌టూల్ అమలు చేయాలని రాష్ట్ర సంఘం తరుపున అధికారులను కోరడం జరిగిందన్నారు.

## ఉచితం పేరుతో వ్యాపారం సమంజసం కాదు

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్ః** ప్రజలకు ఉచితంగా మినరల్ వాటర్‌ను అందజేస్తామని చెప్పి డబ్బులు తీసుకుంటూ వ్యాపారం చేయడం సమంజసం కాదని సిపిఐ నాయకులు కౌన్సిలర్ పి.సుంకయ్య, మోటా రాముడు, కోయిలకొండ నాగరాజులు అన్నారు. సోమవారం పట్టణంలోని కూరగాయల మార్కెట్ పక్కనున్న ఉచిత మినరల్ ప్లాంట్‌ను వారు సందర్శించారు. డబ్బులు వసూళ్ళు చేయడంపై నిర్వాహకులను వారు నిలదీయగా మున్సిపల్ కమీషనర్ ఆదేశాల మేరకే తాము వసూళ్ళు చేస్తున్నామని తెలిపినట్లు వెల్లడించారు. ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టి ప్రైవేట్ వ్యక్తులతో వ్యాపారం చేయడం ఏంటని వారు ప్రశ్నించారు. మున్సిపల్ కమీషనర్ తన వైఖరి మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

## కమణీయం కాశీవిశ్వేశ్వరస్వామి కళ్యాణోత్సవం

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ః** మండల కేంద్రమైన ప్యాపిలి క్రింది గేరిలో వెలసిన శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కళ్యాణమహోత్సవం సోమవారం కమణీయంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకాగా వారికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోటాపోటీగా వృషభాల బల ప్రదర్శన బండలాగుడు పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వృషభాల బండలాగుడు పోటీలు అత్యంత ఉత్సాహంగా సాగాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీలలో గుత్తి మండలం, ఎంగన్నపల్లె గ్రామానికి చెందిన వృషభాలు మొదటి స్థానంలో నిలిచాయి. ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ నిర్వహకులు బోరెడ్డి కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డిలు ముందుండి నడిపించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను వరుసగా టమోటా చంద్ర, సోము, గొల్ల రామ్మోహన్‌యాదవ్, వరుణ్‌కుమార్, టమోటా జగన్, తిమ్మరాజు, మౌలాలి, రంగనాయకులు, రాజా రమేష్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కడితం ప్రతాప్‌రెడ్డి, చింతకుంట సురేష్‌బాబు, నిజాముద్దీన్‌లు పాల్గొన్నారు.

## ప్రజలకు సురక్షిత తాగునీటి అందజేయాలి


వాటర్‌ప్లాంట్లను తనిఖీ చేస్తున్న ఇన్చార్జి మున్సిపల్ కమీషనర్ ఓబులేసు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** పట్టణంలో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వహిస్తున్న యజమానులు ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలని ఇన్చార్జి మున్సిపల్ కమీషనర్ అవుకు ఓబులేసు అన్నారు. సోమవారం మున్సిపల్ అధికారులతో కలిసి పట్టణంలోని వాటర్ ప్లాంట్లను కమీషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సరఫరాకు ఉపయోగించే ట్యాంకులను, అందులో ఉపయోగించే పరికరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. తాగునీటికి సంబంధించి ప్రతి మూడు నెలలకు ఒకసారి పరీక్ష చేయించి మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని అన్నారు. వాటర్ ప్లాంట్ల ద్వారా ఏవిధమైన సమస్యలు తలెత్తిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కమీషనర్ వెంట ఇంజనీర్ షాహీర్ బాష, మున్సిపల్ కార్యాలయ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## అల్లుగుండు హమాలి యూనియన్ ఏర్పాటు


జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్ః** మండల పరిధిలోని అల్లుగుండు గ్రామంలో సిఐటియు అనుబంధ హమాలి యూనియన్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం జాతీయ రహ దారి పక్కన సిఐటియు జెండాను సంఘం జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు మండల కన్వీనర్ ఎన్.రాజు, జిల్లా నాయకులు నగేష్ అధ్యక్షత వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హజరైన సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు గౌస్‌దేశాయ్‌లు మాట్లాడుతూ కార్మికులందరూ ఒకతాటిపైకి వచ్చి సంఘటితంగా ఉండడానికి సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడాన్ని అభినందించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు సి.గురుశేఖర్, మహమ్మద్‌రఫీ, మధు, మండల ఉపాధ్యక్షులు మారెన్న, సీనియర్ నాయకులు కే.రాముడు, గ్రామ పెద్దలు దశరథుడు, బాలమద్దయ్య, శివ, నాగమద్దయ్య, భాస్కర్, అల్లుగుండు హమాలి యూనియన్ నాయకులు ఎల్లకృష్ణ, డి.కృష్ణ, చిలిపికృష్ణ, వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, యాకోబు, రాముడు, అధిక సంఖ్యలో హమాలీ కార్మికులు, ఉలిందకొండ, వెల్దుర్తి బజార్ మహాలి యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## రామలింగేశ్వరస్వామికి ఎమ్మెల్యే కోట్ల పూజలు


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల

డోన్, మేజర్‌న్యూస్ః మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని పాతబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు చేసి నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని స్వామి వారిని ప్రార్థించారు. అనంతరం అర్చకులు ఎమ్మెల్యే కోట్లకు వేద ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల భక్తులతో మాట్లాడి మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని, పాతబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## బడ్జెట్ కేటాయింపులో రాయలసీమ యూనివర్సిటీకి అన్యాయం



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం కేటాయించిన రాష్ట్ర బడ్జెట్‌లో రాయలసీమ యూనివర్సిటీకి తీవ్ర అన్యాయం జరిగిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శరత్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీ ఏర్పడి దాదాపు 18సం॥లు గడుస్తున్నా ఏమాత్రం అభివృద్ధికి నోచుకోకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉందన్నారు. ప్రభుత్వాలు మారిన వర్సిటీ రూపురేఖలు మారడం లేదన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం చేసిందన్నారు. తక్షణమే రాయలసీమ యూనివర్సిటీలో మౌలిక సదుపాయాల కల్పన, పరిశోధన రంగాన్ని ప్రోత్సహించేందుకు రూ.100కోట్ల నిధులను కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ యూనివర్సిటీ నాయకులు అలీ, రాజు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి


శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేస్తున్న చైర్మన్ సప్తశైల రాజేష్, వైకాపా నాయకులు

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్:** ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలు సోమవారం డోన్ పట్టణంలో ఘనంగా జరిగాయి. మాజీ ఆర్థికశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు వైయస్ఆర్‌సిపి కాపు నాయకులు, లెక్చరర్ చంద్ర, కురుకుంద హరి ఆధ్వర్యంలో జరిగిన జయంతి వేడుకలకు ఎంపిపి రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, జడ్పిటిసి బద్దల రాజ్‌కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరైయ్యారు. స్థానిక శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో గల రాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయల వారు గొప్ప పరిపాలన దక్షుడని కొనియాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సాగిన ఆయన పాలనలో విజయనగర సామ్రాజ్యం అత్యున్నత శిఖరాలను చేరుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైయస్ఆర్‌సిపి అధ్యక్షుడు సోమేష్‌యాదవ్, మాజీ సింగిల్ విండో చైర్మన్ తిరుమలరెడ్డి, ఆర్ఈ.రాజవర్ధన్, మల్యాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్ మహేశ్వరరెడ్డి, కురుకుంద మోహన్, క్వాలిటీ అబ్దుల్లా, గద్దం సురేష్, డీలర్ కృష్ణ, రఫీ, ఆదాం, చలం వంశీ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శివ పార్వతుల కళ్యాణం

కర్నూలు టౌన్, మేజర్‌న్యూస్ : నగరంలోని గుత్తి రోడ్డులో ఉన్న సూర్య నారాయణ స్వామి దేవాలయంలో శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ దివ్య ఆశీస్సులతో శివపార్వతుల కళ్యాణం వేదపండితుల వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ముందుగా పరమేశ్వర స్వామికి పంచామృతాభిషేకం కన్నుల పండువగా చేశారు. శివునికి బిల్వ పత్రాలు, మల్లె, బంతి పువ్వులు, పట్టువస్త్రాలతో అలంకరణ చేశారు. శివుడు, పార్వతీదేవిల ఉత్సవ విగ్రహాలను కళ్యాణ మండపం వద్దకు తెచ్చి ఓం నమఃశివాయ, శివాయనమః, స్వామి వారి పంచాక్షరి మంత్రాలు భక్తులు పఠించారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రాల మధ్య శివపార్వతుల కళ్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ టి శివ రామకృష్ణ సహకారం అందించారు.

## శిక్షణ తరగతులు ప్రారంభం

**కర్నూలు జడ్‌పి, మేజర్‌న్యూస్ :** ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 57మంది గ్రేడ్ 4, గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులకు కర్నూలు జిల్లా ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో ఆరు రోజుల పాటు రెఫ్రెషర్ శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభ మయ్యాయి. కార్యక్రమానుద్దేశించి జిల్లా పంచాయతీ అధికారి జి భాస్కర్ మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, విధి నిర్వహణలో గ్రామ పంచాయతీ సమావేశాలు ఏ విధంగా నిర్వహించాలో తెలియజేశారు. సమావేశాలకు సభ్యుల హాజరును పెంచుటకు అభివృద్ధి కార్యక్రమంలో వారి ఏ విధంగా భాగస్వామ్యం చేయాలో తెలియజేశారు. గ్రామ పంచాయతీ రికార్డులను కచ్చితంగా చక్కగా నిర్వహించా లని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్‌సి డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ మంజులవాణి, ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేష్, కృష్ణారెడ్డి, పరిపాలనాధికారి వేణుగోపాల్, సీనియర్ సహాయకులు, టీఓటీలు అస్రఫ్ బాషా, జగన్నాథం, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## నాయి బ్రాహ్మణుల ఇంట వెలుగులు


మాట్లాడుతున్న విజయ్ కుమార్

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** నాయి బ్రాహ్మణులకు సాధారణ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో భాగంగా కూటమి ప్రభుత్వం విద్యుత్ రాయితీ కోసం వార్షిక బడ్జెట్‌లో రూ.50కోట్లు కేటాయించడం హర్షణీయమని నాయిబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాల కవిటి విజయకుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక బిర్లా కాంపౌండ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాయిబ్రాహ్మణులు నిర్వ హించే హెయిర్ కటింగ్ సెలూన్ షాపుల ఉచిత విద్యుత్ కోసం 2026-27వార్షిక బడ్జెట్‌లో రూ.50కోట్ల నిధులు కేటాయించడం శుభ పరిణామమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు లక్షమంది నాయి బ్రాహ్మణులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఈ సమావేశంలో నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు రామచంద్ర, బాలు, మోహన్, బాల ఉసేని తదితరులు పాల్గొన్నారు.

# ఎద్దుల బలప్రదర్శన ప్రారంభించిన మంత్రి


మహానందిలో ఎద్దుల పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినాన నిర్వహించిన రైతు సంబరాల్లో భాగంగా ఒంగోలు జాతి ఎద్దుల బలప్రదర్శన పోటీలలో రాష్ట్ర న్యాయ,మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రారంభించారు. సోమవారం కోర్టు ప్రాంగణంలో ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ మహానంది లో జరిగే ఒంగోలు జాతి బలప్రదర్శన అంటే క్రికెట్‌లో జరిగే ప్రపంచ కప్‌తో సమానం అన్నారు. గతంలో ఆగిపోయిన ఈ ఎద్దుల బలప్రదర్శన పోటీలను తిరిగి ప్రారంభించింది తెలుగుదేశం ప్రభుత్వం అన్నారు. నేడు రాష్ట్ర స్థాయిలో కాకుండా మూడు రాష్ట్రాలో బలప్రదర్శన పోటీలు జరుగుతున్నాయన్నారు. ఈ మహాశివరాత్రి రోజునే 60 చోట్ల జరుగుతున్నాయని, ఒంగోలు జాతి పశువుల పెంపకం ఇంత పెరగడానికి ఈ పోటీలే అన్నారు. ఈ కార్యక్రమంలో కేసికెనాల్ ప్రాజెక్టు చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి, ఎంపీపీ బుడ్డారెడ్డి యశశ్విని‌రెడ్డి, ఒంగోలు జాతి పశువుపోషక సంఘం కొప్పుల శివనాగిరెడ్డి, తదితర మండల నాయకులు పాల్గొన్నారు.

**తెలంగాణ ఎద్దుల విజయకేతనం**

మహానందిలో జరుగుతున్న ఒంగోలు జాతి ఎద్దుల బలప్రదర్శన పోటీలలో సీనియర్స్ విభాగంలో తెలంగాణ ఎద్దులు విజయకేతనం ఎగరవేశాయి. సోమవారం నిర్వహించిన ఈ విభాగంలో 5 జతల ఎద్దులు పోటీల్లో పాల్గొన్నాయి. తెలంగాణ రాష్ట్ర సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్‌కు చెందిన రిటైర్డ్ ఎస్పీ సుంకి సురేంద్రారెడ్డి ఎద్దుల జత 2762 అడుగుల దూరం లాగి మొదటి బహుమతిగా రూ.1.50 లక్షలు కైవసం చేసుకున్నాయి. అలాగే కృష్ణా జిల్లా గన్నవరంకు చెందిన నంది బ్రీడింగ్‌బుల్ రాజాచౌదరి 2700 అడుగుల దూరం లాగి రెండవ బహుమతిగా రూ. ఒక్క లక్ష , నంద్యాల జిల్లా పెద్దకొట్టాల గ్రామానికి చెందిన బొర్రెడ్డి కేశవరెడ్డి, కృష్ణాజిల్లా గంటసాల చెందిన ముఖ కృష్ణమోహన్ జాయింట్ ఎద్దుల జత 2501 అడుగుదూరం లాగి మూడవ బహుమతిగా రూ. 80వేలు, కృష్ణాజిల్లా బావులపాడు మండలం మళ్లవల్లి గ్రామానికి చెందిన అక్కినేని ముఖుల్ సత్యాచౌదరి ఎద్దుల జత 1800 అడుగుల దూరం లాగి నాలుగవ బహుమతిగా రూ. 60వేలు , బాపట్ల జిల్లా చెందురూ మండలం వేటపాళం గ్రామానికి చెందిన ఎద్దుల జత 1601 అడుగుల దూరం లాగి 5వ బహుమతిగా రూ. 40వేలు కైవసం చేసుకున్నాయన్నారు. ఈ మొత్తం రూ.4.55వేలు బహుమతులను కౌర ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ అధినేత మాలేపాటి పుల్లయ్య చౌదరి ఈ బహుమతులను అందించారు.

## వైభవంగా రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

**కర్నూలు టౌన్, మేజర్‌న్యూస్ :** నగరంలోని జగన్నాథ గట్టుపై వెలసిన శ్రీ ఉమా సమేత రూపాల సంగమేశ్వర స్వామి రథోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. దేవాలయ ఈఓ గుర్రెడ్డి, శ్రీనివాసరెడ్డిలు రథోత్సవంలో పాల్గొన్నా రు. రథోత్సవం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

## బలిజలకు శ్రీకృష్ణదేవరాయలు దైవ సమానులు


శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటానికి పూలమాల వేసిన బలిజ సంఘీయులు

**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** బలిజలకు శ్రీకృష్ణదేవరాయలు దైవ సమానులని ప్యాపిలి మండల బలిజ సంఘీయులు పేర్కొన్నారు. శ్రీకృష్ణదేవరాయలు జయంతిని పురస్కరించుకొని సోమ వారం పట్టణంలోని పాత స్టేట్‌బ్యాంక్ నందు గండికోట సప్లయర్స్‌లో నిర్వహించిన కార్యక్ర మంలో శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటానికి బలిజ సంఘీయులు పూలమాల వేశారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ బలిజ సంఘీయులకు శ్రీకృష్ణదేవరాయలు దైవ సమానులుగా ఆరాధిస్తున్నామని, శ్రీకృష్ణదేవరాయలు జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా ప్రకటన చేయా లని కోరారు. కార్యక్రమంలో బలిజ సంఘీయులు శివసాయి స్కూల్ అలా సురేష్, గండి కోట రమేష్, గండికోట చిన్నికృష్ణ, వీరాపురం రాము, కిషోర్, సుబ్రహ్మణ్యం, ఆకుల శ్రీరా ములు, పగడాల కృష్ణయ్య, ఆలమూరి సురేష్‌బాబు, సంజీవ రాయల్, మాగిశెట్టి రాము, చింతకుంట సురేష్, గాజుల శ్రీనివాసులు, హరి, రామకృష్ణ, సోము పాల్గొన్నారు.

# ప్రారంభోత్సవానికి ముహూర్తం ఫిక్స్

- 18వ తేదిన బట్టర్‌పై ఎల్ఈడి లైట్లు ప్రారంభం
- ప్యాపిలి గ్రామ పంచాయితీ ఉప సర్పంచ్ గద్దం భువనేశ్వర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న గద్దం భువనేశ్వర్‌రెడ్డి

**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** ప్యాపిలి పట్టణ సుందరీకరణలో భాగంగా మండల కేంద్రం ప్యాపిలిలో గత వైయస్ఆర్‌సిపి ప్రభుత్వ హయాం లో రూ.16కోట్లతో నిర్మించిన నాలుగు రోడ్ల విస్తరణ పనుల డివైడర్ల మధ్యలో ప్రస్తుతం రూ.30లక్షలతో నిర్మించిన బట్టర్ పై లైట్ల సిఎస్ ఆర్ నిధులు ఆనాటి ఆర్థికశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మంజూరు చేయించినవేనని ప్యాపిలి గ్రామపంచాయితీ ఉపసర్పం చ్ గద్దం భువనేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక గ్రామ పంచా యితీ కార్యాలయంలో వార్డు మెంబర్లతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి 31-3-2024వ తేదిన బట్టర్ పై లైట్ల కోసం సిఎస్ఆర్(కార్పోరేట్ సోషల్ రెస్పాన్సబిలిటీ) నిధులు రూ.30లక్షలు గ్రామ పంచాయితీ ప్రత్యేక ఖాతాలో జమ చేయించారన్నారు. ఎన్నికలు రావడం, ఆపైన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్థానికంగా కొంతమంది టిడిపి నాయకు లు బట్టర్ పై లైట్ల విషయాన్ని ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి దృష్టికి తీసుకుపోవడంతో ఆయన పంచాయితీ అధికారులతో మాట్లాడడం జరిగిందన్నారు. సిఎస్ఆర్ నిధులు రూ.30లక్షలు ఉన్నట్లు ఎమ్మెల్యేకు తెలుపగా, గ్రామ పంచాయితీ అభివృద్ధిలో భాగంగా వాటిని బట్టర్ పై లైట్ల కోసం వినియోగించాలని సూచించా రని తెలిపారు. చెప్పిన ప్రకారం వాటిని పూర్తి చేయడం జరిగిందని, ఈనెల 18వ తేది బుధవారం రాత్రి 7:00 గంటల సమయంలో సర్పంచ్ లక్ష్మీదేవి, గ్రామపెద్దలు, పార్టీలకు అతీతంగా నాయకుల ఆధ్వర్యంలో బట్టర్ పై లైట్ల ప్రారంభోత్సవానికి ము హూర్తం ఫిక్స్ చేసినట్లు ఆయన తెలిపారు. ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, మాజీ మంత్రి బుగ్గన రాజేం ద్రనాథ్‌రెడ్డిలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశం లో వార్డు మెంబర్లు ఎ.రంగనాయకులు, పూజారి శ్రీనివాసులు, నిజాముద్దీన్, సంజామల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### క్వాంటం టెక్నాలజీతో...

# ఉజ్వల భవిష్యత్తు

**- వారంలో ఎఫ్‌డీపీ ప్రారంభం**

**- రాయలసీమ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వెంకట బసవరావు**

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** క్వాంటం టెక్నాలజీతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాయలసీమ విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వెంకట బసవరావు అన్నారు. సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను అందిపుచ్చుకోవడమే లక్ష్యంగా, నగరంలోని రాయలసీమ విశ్వ విద్యాలయం,



మాట్లాడుతున్న వక్తలు

క్లస్టర్ విశ్వ విద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో క్వాంటం టెక్నాలజీపై వారం రోజుల పాటు జరిగే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సదస్సులో ప్రముఖ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, పరిశోధకులు పాల్గొని క్వాంటం రంగంలోని అవకాశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వాంటం టెక్నాలజీ మూడు ప్రధాన స్తంభాలపై ఆధారపడి ఉందని ఆయన వివరించారు. క్వాంటం కంప్యూటింగ్, క్వాంటం కమ్యూనికేషన్, క్వాంటం సెన్సింగ్, మెటీరియల్స్, ఈ కార్యక్రమం అధ్యాపకులకు క్వాంటం టెక్నాలజీలో సైద్ధాంతిక, ప్రయోగాత్మక అంశాలపై శిక్షణను అందిస్తుందన్నారు. న్యూఢిల్లీ రిటైర్డ్ ఎన్‌పిఎల్ సైంటిస్ట్ ప్రొఫెసర్ భగవాన్నారాయణ క్వాంటం క్యూబిట్ టెక్నాలజీ, డీప్ లెర్నింగ్ అనే అంశాలపై క్లుప్తంగా వివరించారు ఈ కార్యక్రమలలో రిజిస్ట్రార్ విజయ కుమార్ నాయుడు, ఎఫ్‌డిపి కోఆర్డినేటర్ డా.ఎం పద్మావతి, ప్రొఫెసర్ సుందరానంద్, ఆర్‌యూ ప్రిన్సిపల్ ఆచార్య సి విశ్వనాథ్ రెడ్డి, ఆచార్య భరత్ కుమార్, డా. వై రఘునాథ్ రెడ్డి, క్లస్టర్ యూనివర్సిటీ నుండి డా. మహమ్మద్ వాహిజ్, డా. హెచ్ అక్తర్‌బాను తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలి

**- ఎస్పీ విక్రాంత్‌పాటిల్**



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కొత్తపేటలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజావేదిక కార్యక్రమానికి 65ఫిర్యాదులు వచ్చాయి. ప్రజా ఫిర్యాదులన్నింటినిపై చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, సిఐలు మన్సూరుద్దీన్, విజయలక్ష్మిలు పాల్గొన్నారు.

## 21 నుంచి జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ : ఈ నెల 21 నుంచి 22వరకు ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలతో పాటు ఎంపిక చేసినట్లు జిల్లా ఆర్చరీ కార్యదర్శి నాగరత్నమయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో విలేకర్లతో మాట్లాడుతూ 10, 13, 15 ఏళ్ల వయసు గల బాల బాలికలు పాల్గొనవచ్చన్నారు. ఇండియన్, రికర్వ్, కాంపౌండ్ రౌండ్ విభాగంలో అండర్-9 జనవరి 1 2016, అండర్-10 జనవరి 1 2013, అండర్-15 జనవరి 1 2011 గల వయసు వారు అర్హులు అన్నారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతో పాటు సర్టిఫికేట్స్, రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 9393855460ని సంప్రదించాలన్నారు. ప్రవేశ రుసుం రూ.500లు చెల్లించి నేరుగా హాజరు కావచ్చన్నారు.

### రాష్ట్ర బడ్జెట్ సమగ్రాభివృద్ధికి...

# భవిష్యత్తు తరాలకు దిశానిర్దేశం

**◆ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి**



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల

**డోన్, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సమగ్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమాన్ని ప్రధానంగా ఉంచుకొని రూపొందించిన ఈ బడ్జెట్ భవిష్యత్తు తరాలకు దిశానిర్దేశం చేసే పథకరూపం అని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసిన బడ్జెట్‌పై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఈ బడ్జెట్ సాధారణ ఆర్థిక లెక్కల సమాహారం మాత్రమే కాదని, ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిబింబంగా, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే విధంగా రూపొందించబడిన కార్యాచరణ ప్రణాళిక అన్నారు. గ్రామీణాభివృద్ధి నుంచి పట్టణాభి వృద్ధి వరకు అన్ని రంగాలకు సముచిత ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. వ్యవసాయ రంగానికి, అనుబంధ రంగాలకు గణనీయమైన నిధులు కేటాయించడం ద్వారా రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పేదల గృహ నిర్మాణానికి అధిక నిధులు కేటాయించడం ద్వారా సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. బీసి, ఎస్సి, ఎస్టీ, మైనారిటీ వర్గాల సంక్షేమానికి ప్రత్యేక కేటాయింపులు చేయడం సామాజిక న్యాయ సాధనకు దోహదపడుతుందన్నారు. విజన్ 2047 లక్ష్యంతో ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ సమగ్రాభివృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు టిఈ.రాఘవేంద్రగౌడ్, డోన్ మాజీ సర్పంచ్ టిఈ. ఎద్దకేశవయ్యగౌడ్, సహకార సంఘం చైర్మన్ చనుగొండ్ల శ్రీరాములు, గుమ్మకొండ గ్రామ సర్పంచ్ దశరథరామిరెడ్డి, బీజేపి నాయకులు రవి, చిన్నమల్కాపురం సీనియర్ టిడిపి నాయకులు దొంతిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు శీలం భాస్కర్‌నాయుడు, భూమా నాగన్న తదితరులు పాల్గొన్నారు.

### 20నుంచి ఓర్వకల్లులో

## ఉరుసు

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** కోరిన కోరికలు తీర్చే కల్పతరువు కొలిచేవారికి కొంగుబంగారమై ఆదుకునే మహిమ నేతలు ఓర్వకల్లులో వెలసిన భక్తుల ఆరాధ్య దైవం హజరత్ సయ్యద్ సాహెబ్ బాబా షా ఖాద్రి స్వామి ఉరుసు మహోత్సవాలు 20వ తేదీ నుంచి మంగళవాయిద్యాలు డప్పు కళాకారులతో గంధం తీసుకెళ్లి స్వామి వారికి సమర్పిస్తారు. 21వ తేదీ అత్యంత భక్తిశ్రద్ధలతో ఉరుసు నిర్వహించి స్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. పాటలు, ఆటల పోటీలు, అన్నదానం, సాయంత్రం జెండాలు ఎక్కించి రాత్రి 10గంటలకు బ్రహ్మాండమైన కవాలి పాట కచేరి ఏర్పాటు చేశారు. 22న సాయంత్రం కుస్తీలతో ఉరుసు ముగుస్తుంది. మూడు రోజుల పాటు ఉరుసు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అలాగే 21న శనివారం కబడ్డీ, 22న వాలీబాల్, ట్రాక్టర్ రివర్స్ పందెం, క్రికెట్ లోకల్ మినీ టోర్నమెంట్ ఏర్పాటు చేస్తున్నట్లు దర్గా నిర్వాహకులు షఫీ, అల్లా షా ఖాద్రి, నజురుల్లా, షా ఖాద్రి, కలిములు శా ఖాద్రి, రిజ్వాన్ అల్లా షా ఖాద్రిలు తెలిపారు. మరిన్ని వివరాలకు 9704489383, 9346118449ను సంప్రదించాలని తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన నగరంలోని వినాయక ఘాట్ పక్కనున్న షాపింగ్ కాంప్లెక్స్ వద్ద సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు మూడవ పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతిడి వయసు 45 నుంచి 50సం॥ల మధ్యలో ఉంటుందన్నారు. చామనచాయ వర్ణంలో ఉండి మాసిన తెల్లని గడ్డంతో ఉన్నాడు. మృతుడి శరీరంపై లేత తెలుపు వర్ణం గల ప్యాంటు వేసుకుని ఉన్నాడు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే సిఐ శేషయ్య, 9121101061, 08518 277187ను తెలియజేయాలన్నారు.

# ఇదెట్లా సారూ..?

**◆ వెంబడించి కూడా... దొంగలను పట్టుకోలేక పోయారా?**

**◆ అసలు దొంగలు దొరకలేదా... వదిలేశారా ?**

**◆ దేవనకొండ పోలీసుల తీరుపై వెల్లువెత్తుతున్న అనుమానాలు**

**దేవనకొండ, మేజర్‌న్యూస్ :**



వారం క్రితం స్థానికులకు చిక్కిన దొంగ

దేవనకొండ పోలీసుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు పోలీసులు విధులు నిర్వర్తించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శలు గుప్పుమంటున్నాయి. గత రెండేళ్లుగా దేవనకొండ మండలంలో దొంగలు పలు దొంగతనాలతో ప్రజలను బెంబేలెత్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత వారం రోజుల క్రితం కర్నూలుకు చెందిన ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులతో చిన్న ఆటోలో వచ్చిన ఓ దొంగల ముఠా దేవనకొండలో పత్తికొండకు వెళ్లే రహదారిలోని వీధిల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. దొంగలను గుర్తించిన స్థానికులు వారిని పట్టుకొని ప్రశ్నించారు. అయితే వారు చెప్పే మాటలకు పొంతన లేకపోవడంతో స్థానికుల అనుమానం పెరిగింది. విషయాన్ని గ్రహించిన దొంగలు వెంటనే తప్పించుకున్నారు. స్థానికులు డయల్100కు కాల్ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వచ్చిన స్థానిక పోలీసులు బైకులపై వెండడించారు. తీరు దొందగలు దొరకలేదనే సమాధానం వినాల్సి వచ్చింది. అయితే వాస్తవానికి పత్తికొండ రోడ్డులో పట్టుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఆ దొంగల ముఠా కర్నూలుకు చెందిన వారిగా గుర్తించిన పోలీసులు కుమ్మక్కయ్యారనే ఆరోపణలు లేకపోలేదు. సెటిల్‌మెంట్ చేసుకొని వదిలేశారని సమాచారం. దీంతో స్థానికులు, మండల ప్రజలు దొంగలను పట్టుకొని శిక్షించాల్సిన పోలీసులే కుమ్మక్కై వదిలేయడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఇదెట్లా సారూ... అని నిలదీస్తున్నారు స్థానికులు. అసలు పోలీసులకు దొంగలు దొరకలేదా... దొరికినా వదిలేశారా అంటూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. డయల్100కు కాల్ చేసి ఫిర్యాదు చేసినా పట్టించుకోరా అంటూ మండిపడుతున్నారు. ఇప్పటికే గత కొన్ని రోజులుగా దేవనకొండ పోలీసుల తీరుపై పలు అవినీతి ఆరోపణలు ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోడం గమనార్హం. ఇక్కడ పోలీసులు వ్యవహరిస్తున్న పరిస్థితులపై జిల్లా పోలీసు అధికారులు ఇప్పటికైనా నిష్పక్షపాతంగా విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు మండల ప్రజలు.

## రాయలవారి ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహించాలి

**ఎమ్మిగనూరు ప్రతినిధి, మేజర్‌న్యూస్ :** దేశ భాషలందు తెలుగు లెస్స అని చాటిన కవి పితామహుడు, విజయనగర సామ్రాజ్య దీశుడు శ్రీ కృష్ణదేవరాయులు ఉత్సవాలను ప్రతి ఏటా ఫిబ్రవరి 16న, అలాగే పట్టాభిషేకం ఆగస్టు 17న రాష్ట్ర ప్రభుత్వమే ఉత్సవాల ను నిర్వహించాలని బలిజ సంఘం నాయకులు రిటైర్డ్ పంచాయతీ రాజ్ డిఈ నాగేశ్వరరావు, కరణంరవి, కరణం దేవేంద్ర, మిఠాయి రవి, గాజుల గిరీ, ఆకుల రాజా శరత్ కుమార్‌లు డిమాండ్ చేశారు. సోమవారం శ్రీకృష్ణ దేవరాయుల 556వ జయంతి ఉత్సవాల్లో భా గంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు నియోజకవర్గంలో నందవరం, గోనెగండ్ల, ఎమ్మిగనూరు రూరల్ ప్రాంతాల్లోనే



నివాళులర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు

కాక ఎమ్మిగనూరు పట్టణంలో మొత్తం కలిపి 8 వేల ఓటు బ్యాంకు ఉన్న బలిజలను రాజకీయ నాయకులు విస్మరించకుండా గుర్తించి కమ్యూనిటీ హాల్‌ను నిర్మాణానికి సహకా రం అందించాలన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు శివ, గాజుల సుధాకర్, మిఠాయి కృష్ణ, గుండా వెంకటేశ్వర్లు, తిమ్మారాజు, వీరేష్, రామకృష్ణ, యోగా మాస్టర్ దామోదర్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.